సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శనివారం । 5 । జులై । 2025



నాట్ల మాటున కాట్ల బెడద

పొలాల్లోని బొరియల్లో ఉన్న విష పురుగులు, పాములు బయటకు వస్తుంటాయి. రైతులు పాము కాటుకు గురై ప్రాణాలను కోల్పోతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.


8లో



చెల్లెలితో మాట్లాడుతున్నాడని హత్య

కాకినాడ జిల్లా సామర్లకోట మండలం పి.వేమవరం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు అనుమానంతో అదే గ్రామానికి చెందిన మరో యువకుడిని హత్య చేసి కప్పి పెట్టేశారు.

1,84,697 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం 1,84,697 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. ఖరీఫ్ సాగుకు సంబంధించి గోదావరి డెల్టా కాలువలకు 11,800 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.40 అడుగులు ఉంది.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ నియామకం

అమలాపురం టౌన్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ జిల్లా కమిటీలో పలువురిని కేంద్ర కార్యాలయం నియమించింది. కమిటీ ఉపాధ్యక్షులుగా కుడుపూడి విద్యాసాగర్ (బుజ్జి) (పి.గన్నవరం నియోజకవర్గం), కొయ్యు బంగారు బాబు (రామచంద్రపురం), దూలం వెంకటేశ్వరరావు (వెంకన్నబాబు) (మండపేట), నాతి సత్యనారాయణ (ముమ్మిడివరం), గుత్తుల వాసు (కొత్తపేట), కూనపరెడ్డి ఎస్ఆర్‌వి ప్రసాద్ (రాజోలు), సుభాష్ చంద్రబోస్ (అమలాపురం), ప్రధాన కార్యదర్శులుగా పెట్టా శ్రీనివాసరావు (రామచంద్రపురం), వెలగల సత్యనారాయణ (మండపేట), వాత్సవాయి కృష్ణంరాజు (కొత్తపేట), రాయపురెడ్డి జానకి రామయ్య (ముమ్మిడివరం), ఈద రవిరెడ్డి (రాజోలు), కోశాధికారిగా కాలెపు నాగ శ్రీనివాసరావు (అమలాపురం), సెక్రటరీ ఆర్గనైజేషనల్‌గా పి.గన్నవరానికి చెందిన కొంబత్తుల ఏసుబాబు, వాసంశెట్టి నాగభూషణం (పెదబాబు), నంబూరి శ్రీరామచంద్ర రాజు, రామచంద్రపురానికి చెందిన చిట్టూరి శ్రీనివాసరావు, మాత నూకారావు, మండపేటకు చెందిన పలివెల మధు, కొప్పిరెడ్డి వెంకట శివ ప్రసాద్, ముమ్మిడివరానికి చెందిన సక్కెలి వెంకటేశ్వర్లు, అంకాడి ఆంజిబాబు, కొత్తపేట నుంచి బండారు దొరబాబు, నంగెడ్ల రంగారావు, దొడ్డారపు వీర వెంకట సుబ్బారావు, మాగాపు విజయకుమార్, రాజోలు నుంచి తులా సత్యనారాయణ, కొల్లాటి నరసింహస్వామి. అమలాపురం నుంచి ఆర్.నాగేశ్వరరావు, చింతా రామకృష్ణ, బడుగు మేరి, సెక్రటరీ యాక్టివిటీలుగా పి.గన్నవరం నుంచి బొంతు శ్రీనివాసరావు, పిల్లి శ్రీనివాసరావు, రామచంద్రపురం నుంచి చొల్లంగి బాలు ప్రకాష్, వెన్నేటి సుందర రామ్‌కుమార్, మండపేట నుంచి గుడిమెట్ల శివరామకృష్ణ (రాంబాబు), టేకిమూడి శ్రీనివాసరావు, ముమ్మిడివరం నుంచి కళా వెంకట రమణ, బడుగు శ్రీనివాసరావు, కొత్తపేట నుంచి గొలకోటి సూర్య ప్రకాష్, షేక్ వల్లీబాబు, వాకలపూడి సుబ్బారావు, దొడపాటి పనసయ్య, రాజోలు నుంచి తాడిచెర్ల మల్లీశ్వరిలను నియమిస్తూ జిల్లా పార్టీ కార్యాలయానికి సమాచారం పంపించింది.

వైద్యులు, విద్యార్థులకు అండగా వైఎస్సార్ సీపీ



చలో విజయవాడపై చర్చిస్తున్న శిరీష్, రమేష్

అమలాపురం టౌన్: గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జిల్లాకో ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మించాలనుకుంటే ఈ ప్రభుత్వం వాటిని ప్రైవేటుపరం చేసి నిర్వీర్యం చేస్తోందని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ జిల్లెళ్ల రమేష్, జిల్లా అధ్యక్షుడు మిండగుదటి శిరీష్ అన్నారు. స్థానిక పార్టీ విద్యార్థి విభాగం కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాకో వైద్య కళాశాల నిర్మాణంలో జాప్యం వల్ల వైద్య విద్య చదవాలనుకునే పేద విద్యార్థులు, విజయవాడ ఎన్టీఆర్ హెల్త్ వర్శిటీ నిర్వాకం వల్ల అక్కడి మెడికోలు పర్మినెంట్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు పొందలేక ఇబ్బంది పడుతున్న వైనంపై వారు ధ్వజమెత్తారు. వైద్య విద్యార్థులు, వైద్యులకు పార్టీ విద్యార్థి విభాగం సంఘీభావం తెలుపుతోందన్నారు. రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షుడు పానుగంటి చైతన్య పిలుపు మేరకు ఈ సమస్యలపై 7వ తేదీన విజయవాడ ఎన్టీఆర్ వర్శిటీ వీసీకి వినతి పత్రం అందించేందుకు విద్యార్థి సంఘాల నాయకులు, పార్టీ ప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో విద్యార్థి విభాగం ప్రతినిధులు బడుగు మోహన్, పెట్టా సత్తిబాబు, ముత్యాల జగన్, మారే రవితేజ, జల్లి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను సత్కరిస్తున్న వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్



గోల్డ్‌మెడల్ అందజేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

అట్టహాసంగా పట్టాల పండగ

- **ఘనంగా జేఎన్‌టీయూకే 11వ స్నాతకోత్సవం**
- **కులపతి హోదాలో హాజరైన** గవర్నర్ అబ్దుల్ నజీర్
- బంగారు పతకాలు, పట్టాల ప్రదానం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కాకినాడ జేఎన్‌టీయూకేలో శుక్రవారం 11వ స్నాతకోత్సవం వర్సిటీ ఆవరణలో అట్టహాసంగా జరిగింది. అతిరథ మహారథుల మధ్య అత్యంత వైభవంగా కనుల పండువగా నిర్వహించారు. 16 సంవత్సరాల చరిత్ర కలిగిన జేఎన్‌టీయూ కాకినాడ ప్రాంగణం ఇందుకు వేదికగా నిలిచింది. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ వర్సిటీ చాన్సలర్ హోదాలో హాజరయ్యారు. దీంతో అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య పరిమిత సంఖ్యలో ఆహూతులతో కార్యక్రమం నిర్వహించారు. 2023 మే 31న 9వ స్నాతకోత్సవం, 2024 జనవరి 30వ తేదీ వర్సిటీ 10వ స్నాతకోత్సవానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరు కాగా మళ్లీ ఇప్పుడు వరుసగా మూడవ సారి కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. బంగారు పతకాలు, పీహెచ్‌డీలు పొందేవారు సంప్రదాయ వస్త్రధారణతో పాల్గొనడంతో ఆడిటోరియం కొత్త శోభను సంతరించుకుంది. వీసీ డాక్టర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ కళాశాల పూర్వ విద్యార్థి కోట సుబ్రహ్మణ్యంకు(సుబుకోటా)కు గౌరవ డాక్టరేట్‌ను గవర్నర్ చేతుల మీదుగా అందజేశారు. గంటా ఐదు నిమిషాల పాటు జరిగిన కార్యక్రమంలో పటిష్ట బందోబస్తు మధ్య 40మంది విద్యార్థులకు బంగారు పతకాలు, ఎండోమెంట్స్ అవార్డ్స్ అందజేశారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సెల్ఫీలతో సందడి చేశారు.



స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ ప్రసాద్

పరిమితంగా అనుమతి

ఆడిటోరియంలోకి పరిమిత సంఖ్యలో అనుమతించగా బయట ప్రత్యేకంగా ఎల్సీడీలు ఏర్పాటు చేసి లైవ్ ద్వారా వీక్షించేందుకు ఏర్పాట్లు చేశారు. తొలుత పతకాలు, పట్టాల గ్రహీతలతో వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గవర్నర్ అనుమతితో కార్యక్రమం ప్రారంభించారు. షెడ్యూల్‌లో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హాజరవుతారని సమాచారం ఇవ్వగా ఆయన వేడుకలకు హాజరుకాలేదు. ముఖ్యఅతిథి శ్రీ కోట సుబ్రహ్మణ్యం (సుబు కోట)మాట్లాడుతూ సాంకేతిక రంగాన్ని ఉన్నత స్థాయికి తీసుకువెళ్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అగుమెంటెడ్ రియాల్టీల ప్రాముఖ్యతను తెలియజేయడంతో పాటు స్టార్టప్‌ల కోసం ఏర్పాటయ్యే ఇంక్యుబేషన్ సెల్స్ విశిష్టతను తెలిపారు. రేపటి యూనికార్న్‌లుగా మారేందుకు సొంత స్టార్టప్‌లను ప్రారంభించాలనుకునే జేఎన్‌టీయూకే విద్యార్థులను ఆయన అభినందించారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని చేపడుతున్న పరిశోధనల ద్వారా నూతన ఆవిష్కరణలు, ఐటీ, బయోటెక్నాలజీ, ఫార్మాస్యూటికల్ రంగాలలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు.



స్నాతకోత్సవ వేదికకు గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను తీసుకువస్తున్న వర్సిటీ డైరెక్టర్లు, పాలక మండలి సభ్యులు

ఉప కులపతి ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కె.ప్రసాద్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలను ప్రపంచ వ్యాప్తంగా పోటీతత్వంతో తీర్చిదిద్దాలని, మార్పులు చేయడంలో ధైర్యం, ధృఢ నిశ్చయం, పెద్ద కలలు కనే సాహసం, సాంకేతిక కార్యకలాపాలలో లోతైన పరివర్తనకు ధైర్యం అవసరమని పట్టభద్రులకు సూచించారు. పరిశోధన కోసం నూతన కోణాలను అవలంబించాలని, సమాజ శ్రేయస్సు కోసం పరిశోధనా ప్రాజెక్టులను చేపట్టాలని కోరారు. పరిశ్రమ, విశ్వవిద్యాలయాలకు అనుసంధానంగా పాఠ్యాంశాలు, కోర్సు రూపకల్పనలు, పరిశ్రమలలో పరిశోధనలను జాతీయ విద్యా విధానం ప్రోత్సహిస్తుందన్నారు. పరిశోధక విద్యార్థులు, గ్రాడ్యుయేట్‌లు జాతీయ క్వాంటమ్ మిషన్‌లో పాల్గొని సమాజ ప్రయోజనం కోసం అధునాతన విప్లవాత్మక సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకురావాలన్నారు. అమృత్ కాల్‌కు సంబంధించి స్పష్టమైన విజన్‌ను రూపొందించడానికి, వికసిత్ భారత్ ద్వారా 2047 నాటికి దేశాన్ని ప్రపంచంలో అగ్రగామిగా నిలిపేందుకు అందరం కలిసి పనిచేద్దామన్నారు. అధిక కొవ్వు గల పదార్థాలను తీసుకోరాదని, పొగ తాగడం, మద్యం, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. మనం ఆరోగ్యంగా ఉంటే సమాజం ఆరోగ్యకరంగా ఉంటుందని, దీనికి ప్రతీ ఒక్కరూ యోగా సాధన చేయాలని సూచించారు.

అనంతరం ఉప కులపతి ప్రొ.సి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను శాలువాతో సత్కరించి మెమెంటోను బహూకరించారు. ఈ స్నాతకోత్సవంలో 99 మంది రీసెర్చ్ స్కాలర్స్‌కు పీహెచ్‌డీ అవార్డులు అందజేశారు. కలెక్టర్ శ్రీ ఎస్.షణ్మోహన్, ఎమ్మెల్సీ శ్రీమతి కర్రి పద్మశ్రీ, రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, నల్లమిల్లి శేషారెడ్డి, మాజీ వీసీలు డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, కొప్పిరెడ్డి పద్మరాజు, శ్రీనివాసకుమార్, కే.మురళీకృష్ణ, శ్రీనివాసరావు, పాలక మండలి సభ్యులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

కార్యక్రమం సాగిందిలా..

3.15 గంటలకు గవర్నర్ అనుమతితో కార్యక్రమం ప్రారంభం 3.30కు పీహెచ్‌డీ, గోల్డ్ మెడల్ విజేతలతో ప్రతిజ్ఞ. 3.35 గంటలకు గవర్నర్ అనుమతితో కోట సుబ్రహ్మణ్యంకు డాక్టరేట్ ప్రదానం. 3.36 గంటలకు 40మందికి బంగారు పతకాలు, ఎండోమెంట్ అవార్డుల ప్రదానం, 3.45కు ముఖ్య అతిథి కోట సుబ్రహ్మణ్యం ప్రసంగం. 3.55 గంటలకు గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగం. 4.10కు రెక్టార్ కేవీ రమణ ధన్యవాదాలు జాతీయ గీతంతో ముగింపు

అలా మొదలై.. ఇలా ముగిసింది

షెడ్యూల్ ప్రకారం కార్యక్రమం మధ్యాహ్నం **3గంటలకు ప్రారంభం** కావలసి ఉండగా 3.10 **గంటలకు ప్రారంభమైంది.** గవర్నర్ అబ్దుల్ **నజీర్ వర్సిటీ** అతిథి గృహం నుంచి ఆడిటోరియంకు **3.07 గంటలకు** చేరు కున్నారు. **యూనివర్సిటీ డైరెక్టర్లు** ఒక్కొక్కరిని వీసీ ప్రసాద్ గవర్నర్‌కు **పరిచయం** చేశారు. గ్రూప్ ఫొటో సెషన్ **అనంతరం గవర్నర్‌ను** వేదికపైకి తీసుకెళ్లారు.

2023-24కు సంబంధించి ప్రకటించిన పట్టాల జాబితా

బీటెక్ - 41,258, బీ ఫార్మసీ 2,081, ఎంటెక్ 1,659, ఎంబీఏ 3,797, ఏంసీఏ 1,115, బీఆర్క్ 83, ఎం.ఫార్మసీ 458, బీబీఏ 115, ఫార్మా-డీ 274, పీహెచ్‌డీ 99 మందికి ప్రకటించారు.

అల్లూరి పోరాటం స్ఫూర్తిదాయకం

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి



అల్లూరికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి



అల్లూరి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ కృష్ణారావు, ఏఎస్పీ ప్రసాద్ తదితరులు

కొత్తపేట: ఆంగ్లేయుల దాస్య శృంఖలాల నుంచి భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చేందుకు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. అల్లూరి జయంతి పురస్కరించుకుని శుక్రవారం ఆత్రేయపురంలో ఆయన అల్లూరి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, అల్లూరి సీతారామరాజు పార్కు, ఆ గ్రామ సెంటర్‌లో సీతారామరాజు విగ్రహాలకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ చిలువూరి రామకృష్ణంరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు కర్రి నాగిరెడ్డి, ముదునూరి కృష్ణంరాజు, వేగేశ్న గోపాలరాజు, గొట్టుముక్కల గోపి పాల్గొన్నారు.

స్వాతంత్ర్య పోరులో అల్లూరి పాత్ర చారిత్రాత్మకం : జిల్లా ఎస్పీ కృష్ణారావు

అమలాపురం టౌన్: దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహానుభావులు పోరు సలిపారని, అందులో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పాత్ర చారిత్రాత్మకమని ఎస్పీ బి.కృష్ణారావు అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు 128వ జయంతి సందర్భంగా స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన జయంతి సభలో ఎస్పీ మాట్లాడారు. తొలుత మన్యం వీరుడు అల్లూరి చిత్ర పటానికి పూల మాలలు వేసి పోలీసు అధికారులు ఘనంగా నివాళులర్పించారు. జిల్లా ఏఎస్పీ ఏవీఆర్‌బీపీ ప్రసాద్ స్వాతంత్ర్య సమరంలో అల్లూరి పాత్రను వివరించారు. జిల్లా ఆర్మ్‌డ్ డీఎస్పీ సుబ్బరాజు, స్పెషల్ బ్రాంచి సీఐ బి.రాజశేఖర్, డీసీఆర్‌బీ సీఐ వి.శ్రీనివాసరావు, సోషల్ మీడియా పర్యవేక్ష సీఐ జి.వెంకటేశ్వరరావు, ఆర్మ్‌డ్ ఆర్ఐ బ్రహ్మానందంలతో పాటు ఎస్పీ కార్యాలయ ఎస్సైలు, సిబ్బంది విప్లవ వీరుడు అల్లూరి సేవను కొనియాడి ఘనంగా నివాళులు అర్పించారు.

భూముల రక్షణలో యంత్రాంగం

- రైల్వే, జాతీయ రహదారుల ప్రాజెక్టులకు సేకరించిన భూమికి కంచె ఏర్పాటు
- అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం

సాక్షి, అమలాపురం: చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందాన రైల్వే ప్రాజెక్టు.. జాతీయ రహదారుల కోసం సేకరించిన భూముల పరిరక్షణకు జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోంది. దీనిలో భాగంగా సేకరించిన భూములకు ఫెన్సింగ్, లేదా స్తంభాలు వేయాలని నిర్ణయించింది. రెండు దశాబ్దాల క్రితం సేకరించిన భూమికి సంబంధించి వివాదాలు తలెత్తడంతో ఈ నిర్ణయానికి వచ్చింది.

కోటిపల్లి - నర్సాపురం రైల్వే ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా అయినవిల్లి మండలం శానపల్లిలంక వద్ద గౌతమీ నది వంతెన నుంచి అమలాపురం మండలం భట్నవిల్లి వరకు రైల్వే శాఖ గతంలో భూమి సేకరించింది. దీనికి అప్పట్లోనే పరిహారం చెల్లించింది. సేకరించిన భూమి రైల్వే శాఖ పరిధిలోకి వచ్చినా ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టలేదు. రైల్వేలైన్ కోసం సేకరించిన ఈ భూమిలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టలేదు. 2000లో మొదలైన ప్రాజెక్టు పనులకు 2016 వరకు పెద్దగా నిధులు కేటాయింపు జరగలేదు. ఇప్పుడు ప్రాజెక్టుకు నిధులు వచ్చి నిర్మాణాలు జరుగుతున్నా అవి కేవలం నదీపాయలపై మూడు వంతెనల నిర్మాణాలు మాత్రమే జరుగుతున్నాయి. దీనితో శానపల్లిలంక నుంచి భట్నవిల్లి వరకు సేకరించిన భూమి రికార్డులలో రైల్వే పరిధిలో ఉండగా వాస్తంగా అక్కడ రైతులు సాగు చేసుకుంటున్నారు. రెండు పుష్కరకాలాల తరువాత ఈ భూమిపై వివాదం రేగింది. ఇప్పుడు ఇస్తున్నట్టుగా పరిహారం ఇవ్వాలని కొంతమంది కోర్టును ఆశ్రయించడం, దీనిపై స్టే ఇవ్వడం జరిగింది. తాజాగా ఈ కేసులపై స్టేలను కోర్టు ఎత్తివేయడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. రైల్వేలైన్‌కు సేకరించిన భూముల చుట్టూ ఫెన్సింగ్ వేయడం, లేదా స్తంభాలు పాతడం చేయాలని నిర్ణయానికి వచ్చింది. దీనితోపాటు వైనతేయ, వశిష్ట నదీపాయలపై వంతెనలకు సేకరించిన భూములకు, కొత్తగా సేకరించే భూముల విషయంలో కూడా ఇదే తరహా అవలంబించాలని నిర్ణయించింది. పనిలో పనిగా జాతీయ రహదారి 216 ఈ, ఇతర నిర్మాణాలకు సేకరించిన భూముల పరిరక్షణకు సిద్ధమైంది. దీనిపై జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన సమీక్షలో కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ దిశా నిర్దేశం చేశారు. ఈ ప్రక్రియలో ఎన్‌హెచ్, ఆర్అండ్‌బీ, రైల్వే శాఖలు భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం భూసేకరణ పురోగతిని పరిశీలించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, ఆర్డీవోలు పి.శ్రీకర్, కె.మాధవి, డి.అఖిల, ఎన్‌హెచ్ డీఈఈ టి.నిక్కి క్రేజీ పాల్గొన్నారు.



రైల్వేప్రాజెక్టు కోసం భట్నవిల్లిలో సేకరించిన భూమిలో స్టేషన్ కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకం



కలెక్టరేట్‌లో రైల్వే ప్రాజెక్టు, జాతీయ రహదారుల భూ సేకరణపై సమీక్ష జరుపుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

క్లుప్తంగా

మహిళను హత్య చేసిన ముగ్గురికి జీవిత ఖైదు


దేవబత్తుల నాగమహేష్


నక్కా చందు


దేవబత్తుల లక్ష్మణరావు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): మహిళను హత్య చేసి బంగారం, నగదు దోచుకువెళ్లిన కేసులో ముగ్గురికి జీవితఖైదు విధిస్తూ 10వ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు కమ్ ఎస్సీఅండ్ఎస్టీ కోర్టు న్యాయమూర్తి ఎస్. ఉమసునంద శుక్రవారం తీర్పునిచ్చారు. రాజమహేంద్రవరం జాంపేట వద్ద పుచ్చల నాగభారతి హోటల్ నిర్వాహకురాలు. లలితానగర్‌కు చెందిన దేవబత్తుల నాగమహేష్, దేవబత్తుల లక్ష్మణరావు ఆమె హోటల్‌కు సమోసాలు సరఫరా చేసేవారు. ఈ నేపథ్యంలో నాగభారతి ఇంటిలో ఓ ఫంక్షన్‌కు సమోసాలు ఆర్డర్ ఇచ్చింది. వారు సమోసాలు తీసుకు వచ్చిన సమయంలో భారతి ఒంటి నిండా బంగారు ఆభరణాలు ధరించి ఉండడంతో వాటిని దోచుకోవాలని భావించారు. ముందస్తు పథకం ప్రకారం అన్నపూర్ణమ్మపేటకు చెందిన నక్క చందు అనే వ్యక్తిని తీసుకుని నాగమహేష్, లక్ష్మీనారాయణ 2013 డిసెంబర్ 2న మధ్యాహ్నం నాగభారతి ఇంటికి వెళ్లారు. ఆమె ఒంటిపై బంగారు నగలు లాక్కునేందుకు ప్రయత్నించారు. ఆమె ప్రతిఘటించడంతో వారు ఆమెను హతమార్చి ఆభరణాలు తీసుకుని పారిపోయారు.

నాగభారతి భర్త ప్రసాదరావు ఫిర్యాదు మేరకు మూడో పట్టణ సీఐ ఎం.రమేష్, ఎస్.గంగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి ముద్దాయిలను అదుపులోకి తీసుకుని ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. అడిషనల్ పీపీలు ఎ.రాధాకృష్ణరాజు, డి.శ్రీవాణిబాయి వాదనలు వినిపించారు. నిజనిర్ధారణ కావడంతో నిందితులకు జీవిత కారాగార శిక్ష, రూ.5 వేలు జరిమానా విధించారు. నిందితులకు శిక్ష పడడంలో కేసును పర్యవేక్షించిన ప్రస్తుత సీఐ అప్పారావు, కోర్టు ఏఎస్సై జి.వెంకటేశ్వర్లును ఎస్పీ డి.నరసింహకిశోర్ ప్రత్యేకంగా అభినందించినారు.

నాట్ల మాటున కాట్ల బెడద

- అప్రమత్తతతో పాములకు చెక్
- ఖరీఫ్ వేళ పొంచి ఉన్న ప్రమాదాలు
- భయంతోనే ప్రాణానికి గండం
- ధైర్యం.. అవగాహన.. తప్పనిసరి

రాయవరం: తొలకరి పలకరించడంతో రైతులు పొలంబాట పడుతున్నారు. వాతావరణం చల్లబడడంతో పంట పొలాల్లోని బొరియల్లో ఉన్న విష పురుగులు, పాములు బయటకు వస్తుంటాయి. వ్యవసాయ పనుల్లో తలమునకలయ్యే రైతులు పాము కాటుకు గురై నిండు ప్రాణాలను కోల్పోతున్న సంఘటనలు జిల్లాలో చోటు చేసుకుంటున్నాయి.

పాముకాటుకు గురైన సందర్భాలలో సకాలంలో వైద్యం అందక పోతే మత్యువాత పడుతుంటారు. పాము కాటుకు గురికాకుండా ఏం చేయాలి? ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి? ప్రాథమిక చికిత్సపై అవగాహన అందరికీ అవసరం.

ప్రాణసంకటమే..

రబీ ముగిశాక వేసవిలో రైతులు పొలాల వద్దకు తక్కువగా వెళ్తుంటారు. సుమారు రెండు నెలల పాటు పొలాల్లో అంతగా అలికిడి ఉండక పోవడంతో అక్కడికి పాములు చేరతాయి. తిరిగి ఖరీఫ్ పనులు మొదలుపెట్టే సందర్భంలో పాములు బయటకు వచ్చి కాటు వేస్తుంటాయి. ఏటా వర్షాకాలం ప్రారంభంలో ఇలాంటి ఘటనలు అధికమవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పొలం గట్ల పక్కన నివాసం ఉండే ప్రాంతాల్లో ఎక్కువగా పాముకాటు మరణాలు సంభవిస్తుంటాయి.


నాట్ల మధ్య సంచరిస్తున్న పాము

అప్రమత్తంగా ఉండాలి

- రైతులు చేల గట్లపై నడిచే సమయంలో పాదరక్షలు ధరించాలి.
- కర్రతో చప్పుడు చేస్తూ నడవడం వల్ల అలికిడికి పాములు వెళ్లిపోతాయి.
- ధాన్యపు గాదెలు, గడ్డివాములు, తడిగా ఉండే చోట కప్పలు, ఎలుకల కోసం పాములు తిరుగుతుంటాయి.
- దుంగలు, కట్టెల్లో పాములు ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది.
- రైతులు ఇళ్ల వద్ద ఏర్పాటు చేసుకునే పిడకలు, డొక్కల గూళ్ల మధ్య విష కీటకాలు ఉండే అవకాశం ఉంది.
- రాత్రి పూట మోటార్ వేయడానికి, పొలాలకు నీరు పెట్టడానికి వెళ్లేటప్పుడు విధిగా టార్చిలైట్ ఉపయోగించాలి.
- మోటార్ షెడ్‌లో స్టార్టర్ వద్ద కూడా పాములు ఉండే అవకాశం ఉంటుంది.
- ఇళ్ల చుట్టూ శుభ్రంగా ఉంచుకోవాలి. ఎలాంటి చెత్తాచెదారం, ముళ్ల పొదలు ఉండకూడదు.
- గోడల వారన పాములు నక్కే అవకాశం ఉన్నందున కట్టెల వంటివి ఉంటే వాటిని తొలగించాలి.



యాంటీ వీనమ్ ఇంజెక్షన్

రెండు గాట్లు పడితే

సాధారణ విష సర్పం కాటు వేసిన ప్రదేశంలో కోరల గాయం స్పష్టంగా కన్పించి, నొప్పి తీవ్రంగా ఉంటుంది. నొప్పి క్రమంగా పైకి వ్యాపిస్తూ తిమ్మిరిగా అనిపిస్తుంది. పాక్షిక పక్షవాతం వల్ల నాలుక మందమైనట్లు, గొంతు కండరాలు బిగుసుకున్నట్లు, గొంతులో ఏదీ దిగని పరిస్థితి తలెత్తవచ్చు. చొంగ కారడంతో పాటు కళ్లు మగతగా, శరీరం మత్తుగా ఉండి స్పృహ కోల్పోవచ్చు. రెండు గాట్లు పడితే విషపూరితమైన పాము అని గుర్తించాలి. తాచు పాము కంటే కట్లపాము ప్రమాదకరం. కట్లపాము కాటేసిన క్షణాల్లోనే విషం రక్త కణాల్లో కలుస్తుంది. రక్తపింజర కాటేస్తే విషం రక్తంలో చేరుతుంది. నోరు, ముక్కు ద్వారా రక్తం బయటకు వస్తుంది. వెంటనే బాధితులను ఆస్పత్రికి చేర్పించాలి. తాచుపాము కాటేసిన 15 నిమిషాల్లోనే శరీరంలోనికి విషం ప్రవేశిస్తుంది.

ధైర్యం చెప్పాలి

- పాము విషం కన్నా చాలా మంది షాక్‌తోనే ప్రాణం మీదకు తెచ్చుకుంటారు. పాముకాటుకు గురైన వ్యక్తికి ధైర్యం చెప్పాలి.
- చాలా పాములకు విషం ఉండదు. తాచు పాము, కట్లపాము, రక్తపింజరి, పొడపాము వంటి 15శాతం సర్పజాతులు ప్రమాదరకమైనవి.
- నాటు వైద్యం, మంత్ర తంత్రాలు అని ఆలస్యం చెయ్యకుండా సాధ్యమైనంత త్వరగా దగ్గర్లోని ఆస్పత్రికి రోగిని తీసుకెళ్లాలి. రోగిని ఎట్టి పరిస్థితుల్లో నడిపించకూడదు.
- సాధ్యమైనంత వరకు 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించాలి. పాము కాటు వేసిన ప్రదేశం పైభాగంలో రక్త ప్రసరణ జరగకుండా బలంగా కట్టుకట్టాలి.

ఆధునిక చికిత్సతో లాభాలు

- విషం విరుగుడు ఇంజెక్షన్ రూపంలో త్వరగా పనిచేస్తుంది.
- బాధితునికి ఆందోళన, షాక్ వల్ల తలెత్తే ఇతర సమస్యలు సమర్ధవంతంగా నివారించవచ్చు.
- సెలైన్ రూపంలో చికిత్సను మెరుగ్గా అందించే వీలుంటుంది.
- చికిత్స ఆలస్యం వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే మెడికో లీగల్ కేసుగా అధికారికంగా నమోదై ఆపద్బంధు పథకం కింద ప్రభుత్వం నుంచి పరిహారం పొందవచ్చు.

జిల్లాలో పరిస్థితి ఇదీ

కోనసీమ జిల్లాలో 2014 జనవరి నుంచి ఈ ఏడాది జూన్ 27వ తేదీ వరకు 72 మంది పాము కాట్లకు గురయ్యారు. వీరిలో ఇద్దరు మృతి చెందారు. జిల్లాలో ప్రస్తుతం 1,724 యాంటీ వీనమ్ ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నట్లు వైద్యశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రతి పీహెచ్‌సీలోనూ 20 వరకు యాంటీ వీనమ్ వైల్స్ అందుబాటులో ఉన్నట్లు చెబుతున్నారు.

ఇంజెక్షన్ల కొరతలేదు



ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైనందున విషసర్పాల సంచారం అధికమవుతుంది. ముఖ్యంగా పొలాలకు వెళ్లే రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. పాము కాటు బాధితులు ఆస్పత్రికి చేరేలోగా ప్రాథమిక వైద్యం చాలా ముఖ్యం. యాంటీ వీనమ్ ఇంజెక్షన్లకు కొరతలేదు. – దుర్గారావు దొర, జిల్లా వైద్యాధికారి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

నిర్లక్ష్యం చేయకూడదు



ఎటువంటి పాముకాట్లకు గురైన వారైనా ముందుగా ఆస్పత్రికి చేర్చితే ప్రాథమిక చికిత్స చేసి యాంటీ వీనమ్ ఇంజెక్షన్ చేస్తారు. పాముకాటుకు గురైన వారు ఎటువంటి భయాందోళనలకు గురి కాకుండా చూసుకోవాలి. పాము కరిచిన వ్యక్తికి చుట్టుపక్కల వారు ధైర్యం చెప్పాలి. పాము, కుక్కకాటుకు మందులు అందుబాటులో ఉన్నాయి.

– వి.అనిరుధ్, ప్రాథమిక వైద్యాధికారి, పీహెచ్‌సీ, రాయవరం.

చెల్లెలితో మాట్లాడుతున్నాడని హత్య

- యువకుడిపై దాడిచేసి ఇసకలో కప్పిపెట్టిన నిందితులు
- పోలీసులకు లొంగిపోయిన వైనం
- పి.వేమవరంలో సంచలనం సృష్టించిన ఘటన


కిరణ్ కార్తిక్ (ఫైల్)

సామర్లకోట: కాకినాడ జిల్లా సామర్లకోట మండలం పి.వేమవరం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు అనుమానంతో అదే గ్రామానికి చెందిన మరో యువకుడిని హత్య చేసి జగనన్న లే అవుట్‌లో కప్పి పెట్టేశారు. సంచలనం రేపిన ఈ ఘటన వివరాలను సీఐ ఎ.కృష్ణ భగవాన్ వివరించారు. పి.వేమవరానికి చెందిన యువతి అదే గ్రామానికి చెందిన నొక్కు కిరణ్‌కార్తిక్ (19) కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. హైదరాబాద్‌లో ఉంటున్న ఆ యువతి అన్నయ్య నూతలకట్టు కృష్ణ ప్రసాద్ అడపాదడపా గ్రామానికి వచ్చినపుడు తన చెల్లి ఎవరితోనో మాట్లాడుతున్న విషయం తెలుసుకుని కార్తిక్‌ను మందలించాడు. తన చెల్లెలని బాగా చదివించాలనుకుంటున్నానని ఈ వ్యవహారాలకు దూరంగా ఉండాలని హెచ్చరించాడు. అయినప్పటికీ పరిస్థితిలో మార్పు రాకపోవడంతో గత నెల 24వ తేదీ రాత్రి కృష్ణ ప్రసాద్ తన స్నేహితుడు దూలపల్లి వినోద్ సాయంతో కార్తిక్‌ను పిలిచి పని ఉంది మాట్లాడదాం రమ్మని తీసుకువెళ్లారు. అతడిని అచ్చంపేట శివారు బ్రహ్మానందపురంలోని జగనన్న లేఅవుట్‌కు తీసుకువెళ్లి అతడితో ఘర్షణపడి కొట్టి హత్య చేసి గోతిలో కప్పిపెట్టేశారు. అనంతరం కృష్ణ ప్రసాద్ హైదరాబాద్‌కు వెళ్లిపోయాడు. ఇదిలా ఉండగా గతనెల 24వ తేదీనే ఉప్పాడలోని వెల్డింగ్ దుకాణంలో పనిచేస్తున్న కార్తిక్, అతని తండ్రి వెంకటరమణల మధ్య చిన్న వాగ్వాదం జరిగింది. కూలీలకు సొమ్మలిచ్చే విషయంలో తేడా రావడంతో కార్తిక్‌ను అతని తండ్రి మందలించాడు. దీంతో కార్తిక్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కానీ ఆ రోజు రాత్రి అతడు ఇంటికి రాకపోవడం, రాత్రి పది గంటల తరువాత ఫోన్ పనిచేయకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి ఇళ్లలో గాలించారు. ఏ ప్రయత్నమూ ఫలించకపోవడంతో 27వ తేదీన తండ్రి వెంకటరమణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డబ్బు విషయంలో తేడా రావడంతో మందలించడంతో తమ కుమారుడు అలిగి వెళ్లి ఉంటాడని తాము భావించామని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నాడు. సీఐ ఎ కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో కృష్ణప్రసాద్ తన స్నేహితుడు వినోద్‌కు తరుచూ ఫోన్ చేసి ఇక్కడి పరిస్థితిని తెలుసుకునేవాడు. పోలీసుల దర్యాప్తు చేస్తున్నారని తెలిసి, వారు తమను గుర్తిస్తే కేసు తీవ్రంగా ఉంటుందని భావించి గురువారం రాత్రి కృష్ణప్రసాద్, వినోద్ పోలీసులకు లొంగిపోయినట్లు సీఐ వివరించారు. ముద్దుగా చదివించుకుంటున్న తన చెల్లిని మోసం చేస్తాడనే అనుమానంతో హత్య చేసినట్లు కృష్ణప్రసాద్ చెప్పాడని సీఐ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నిందితులను ఘటనా ప్రదేశానికి తీసుకువెళ్లి మండల మెజిస్ట్రేట్, తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి సమక్షంలో మృతదేహాన్ని వెలికితీసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు జి.నాగేశ్వరరావు, వై.ముసలయ్య, ఎం.పృథ్వి, సీహెచ్ ప్రసాద్, బాబీ, రాజేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. అదృశ్యం కేసును హత్య కేసుగా మార్చి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


పోలీసులకు లొంగిపోయిన వినోద్, కృష్ణప్రసాద్


హత్య జరిగిన స్థలంలో విలేకర్లతో మాట్లాడుతున్న సీఐ, తహసీల్దార్‌లు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	18,000 – 18,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	27,500
గటగట (వెయ్యి)	25,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	26,500
గటగట (వెయ్యి)	24,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	17,000 – 17,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 18,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

తలుపులమ్మకు చీర, సారె


తలుపులమ్మకు చీర, సారె సమర్పిస్తున్న వాసవీ కన్యకాపరమేశ్వరి మహిళా భక్త సమాజం సభ్యులు, పలు గ్రామాల మహిళలు

వైభవంగా సామూహిక కుంకుమ పూజ, హోమం

తుని రూరల్: ఆషాఢ మాసోత్సవాలను పురస్కరించుకుని తలుపులమ్మ అమ్మవారికి తుని వాసవీ కన్యకా పరమేశ్వరి మహిళా భక్త సమాజం, వివిధ గ్రామాల మహిళలు చీరసారెలను సమర్పించారు. శుక్రవారం చీరసారెలతో వచ్చిన మహిళలకు కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు ఆధ్వర్యంలో వేద పండితులు, ప్రధాన అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి చీరసారె సమర్పించిన తర్వాత సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. దేవస్థానం తరపున భక్తులందరికీ పసుపు, కుంకుమ, రవిక, గాజులు, ప్రసాదాలను అందజేశారు. అమ్మవారికి శాస్త్రోక్తంగా శాంతి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. ఈ నెల 24న సప్తనదీ జలాలతో అమ్మవారికి సహస్ర ఘటాభిషేకం నిర్వహిస్తున్నట్టు ఈఓ తెలిపారు.

గంజాయి కోసం బైక్ చోరీలు

- ముగ్గురి అరెస్టు, మరొకరు పరారీ
- 14 కిలోల గంజాయి, 14 బైక్‌ల స్వాధీనం

గోకవరం: గంజాయికి అలవాటు పడిన యువకులు చోరీల బాట పట్టారు. బైక్‌లను చోరీ చేస్తూ వాటిని గంజాయి ముఠాకి అప్పగించి వారి వద్ద నుంచి గంజాయి తెచ్చుకుంటూ జల్సాలు చేస్తున్నారు. ఈ విధంగా బైక్‌లు చోరీ చేస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని 14 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఆ వివరాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్ శుక్రవారం వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు గోకవరం మండలం కామరాజుపేటకు చెందిన పాశం కొండలరావు అలియాస్ నాని అలియాస్ కళ్యాణ్, వాకాడ పవన్‌కుమార్ అలియాస్ ముక్కా పవన్, కాకర్ల వెంకట కుమార్ అలియాస్ వెంకట్, గోకవరానికి చెందిన ఆవుల వంశీ వ్యసనాలకు బానిసలయ్యారు. వీరు మరికొంత మందితో కలిసి గంజాయి కోసం ఇళ్ల బయట నిలిపిఉంచిన ఖరీదైన స్పోర్ట్స్ బైక్‌లను దొంగతనాలు చేసి ఏజెన్సీలోని గంజాయికి మారకం చేసి ఆ మత్తును సేవిస్తున్నారు. శుక్రవారం గోకవరం శివారు కొత్తపల్లికి వెళ్లే మార్గంలో బాపనమ్మ ఆలయం వద్ద ఎస్సై పవన్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు బైక్‌లపై వస్తున్న వీరిని పోలీసులు గుర్తించి నిలువరించగా తప్పించుకునే ప్రయత్నం చేశారు. సిబ్బంది వారిని చాకచక్యంగా పట్టించుకునే ప్రయత్నంలో వంశీ తప్పించుకున్నాడు. మిగిలిన ముగ్గురు నుంచి 14 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని వారిని విచారించారు. ఈ సందర్భంగా బైక్‌ల చోరీ గురించి వెల్లడించారు. ఈ సమాచారంతో కామరాజుపేట శివారున ఫారెస్టు చెక్‌పోస్టు సమీపంలోని పైపులైన్ బ్రిడ్జి కింద దాచి ఉంచిన 14 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం తరలించనున్నామనని, తప్పించుకున్న మరో యువకుడిని త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు. మండలంలో గంజాయి రవాణా, విక్రయాల సమాచారం ఉంటే తమకు చెప్పాలని ఆయన కోరారు. కోరుకొండ సీఐ సత్యకిశోర్, ఎస్సై పవన్‌కుమార్, ఇతర సిబ్బంది ఈ దర్యాప్తులో పాల్గొన్నారు.


విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీకాంత్

క్లోరిన్ లీకేజీపై మాక్ డ్రిల్

కాకినాడ రూరల్: పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో కాకినాడలోని ఎం గ్రీన్ ప్రైవేట్ లిమిటెడ్ కర్మాగారంలో క్లోరిన్ లీక్‌పై శుక్రవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జీవీవీఎస్ నారాయణ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాంబాబు, ఫ్యాక్టరీ ప్రతినిధులు సన్నీ జాన్, శ్రీనివాస్, కోరమాండల్ ప్రతినిధులు పాల్గొన్నారు.


క్లోరిన్ లీకేజీపై మాక్ డ్రిల్‌తో అవగాహన కల్పిస్తున్న అధికారులు

విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి

- విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లేనని బాలిక కుటుంబికుల ఆందోళన
- న్యాయం చేయాలని డిమాండ్


జొన్నకూటి సౌమ్య (ఫైల్)

తాళ్లపూడి(కొవ్వూరు): విద్యుదాఘాతంతో పదో తరగతి విద్యార్థి మృతి చెందిన ఘటన కొవ్వూరు మండలం ధర్మవరంలో చోటుచేసుకుంది. ధర్మవరానికి చెందిన జొన్నకూటి సౌమ్య (15) స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతుంది. శుక్రవారం ఉదయం ఇంటి వద్ద దుస్తులు ఆరేసే తీగపై విద్యుత్ లైన్ తెగిపడడంతో విద్యుదాఘాతానికి గురై ఆమె మృతి చెందింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు విద్యుదాఘాతంతో విలవిలలాడుతున్న ఆమెను కాపాడటానికి తన అన్నయ్య, ఓ స్నేహితుడు చేసిన ప్రయత్నంలో వారు సైతం స్వల్పంగా గాయపడ్డారు. వారిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. తమ కుటుంబాలకు తగిన న్యాయం వెంటనే చేయాలని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి పంచనామా కేంద్రం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మృతురాలి బంధువులు మాట్లాడుతూ ధర్మవరం గ్రామంలో సర్వీస్ వైరు కిందకి ఉందని పదే పదే చెబుతున్నా పట్టించుకోని అధికారుల నిర్లక్ష్యం వల్ల ఒక నిండు ప్రాణం బలైందని వారు ధర్నా చేశారు. బాలిక కుటుంబానికి తగిన న్యాయం జరగాలని, గ్రామంలో విద్యుత్ స్తంభాలన్నీ వెంటనే మార్చి మరో ప్రాణం పోకుండా చూసుకోవాలని కోరారు. పోలీసులు సద్దిచెప్పడంతో వారు ఆందోళన విరమించారు. ఈ సంఘటనపై కొవ్వూరు రూరల్ పోలీసులు, ఎస్సై శ్రీహరి వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.


విద్యుదాఘాతంతో మృతి చెందిన సౌమ్య


కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు

గాదరాడలో యువకుడు..

కోరుకొండ: మండలంలోని గాదరాడ గ్రామానికి చెందిన సేనాపతి శ్రీను (34) గురువారం విద్యుదాఘాతంతో మృతిచెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై కూన నాగరాజు తెలిపారు. వ్యవసాయకూలీగా జీవించే శ్రీను గురువారం తన ఇంటి వద్ద మోటార్ ఆన్ చేయగా విద్యుత్ షాక్ తగిలింది. అతడిని కాపాడబోయిన తల్లి మోటార్‌ను ఆపే క్రమంలో తానూ షాక్‌కు గురైనా విద్యుత్ సరఫరాను ఆపగలిగింది. దీంతో కింద పడిపోయిన శ్రీనును స్థానికుల సాయంతో ఆస్పత్రికి తరలిస్తుండగానే అతడు మృతి చెందాడు. శ్రీనుకు భార్య ఉంది. విద్యుదాఘాతంతో మృతిచెందినట్టు కేసు నమోదు చేసి శుక్రవారం రాజమహేంద్రవరం జీహెచ్‌లో శవపంచనామా నిర్వహించారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి ఎడ్ల పందేలు


పందెంలో పోటీపడుతున్న ఎడ్లు

జగ్గంపేట: మండలంలోని మామిడాడలో కోటాలమ్మ అమ్మవారి జాతరను పురస్కరించుకుని గ్రామ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఎడ్ల పందేలు శుక్రవారం నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో గుమ్మిలేరు, జూనియర్స్ విభాగంలో దుళ్ల ఎద్దులు ప్రథమ స్థానంలో నిలిచాయి. విజేతలకు మాజీ మంత్రి, జగ్గంపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తోట నరసింహం, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ బహుమతులు, జ్ఞాపికలు అందచేసారు. సీనియర్స్ విభాగంలో ప్రథమ స్థానంలో కూర వీరవెంకట సత్యవేణి (గుమ్మిలేరు), ద్వితీయ స్థానంలో వల్లూరి లత (మండపేట) తృతీయస్థానంలో కానుమల్లి జైవర్దన (ఏడిద) గెలుపొందారు. అలాగే జూనియర్స్ విభాగంలో తూము శ్రీను (దుళ్ల), బొజ్జ నారాయణరావు(పిఠాపురం), బండారు శ్రీను మెమోరియల్(కొప్పవరం)ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో గెలుపొందారు.